

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.180	250	270
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 24.8



సమస్యల బడి

- నేడు పాఠశాలల పునఃప్రారంభం
- ప్రారంభ సమయంలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు
- స్కావెంజర్స్ లేక అపరిశుభ్రంగా పాఠశాలలు
- నాలుగు నుంచి ఐదు మండలాలకు ఒక ఎంఈవో
- ఇంకా పూర్తిస్థాయిలో అందని పుస్తకాలు
- ప్రస్తుతానికి ఒక జత యునిఫాంతోనే సరి

వేసవి సెలవుల అనంతరం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 4,500 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బడి గంట మోగనుంది.దాదాపు 4,50, 000 మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. నెల రోజులకు పైగా వేసవి సెలవుల్లో ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు బడికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ఫీజులు, యూని ఫాం, పుస్తకాల కొనుగోళ్లకు అవుతున్న ఖర్చును చూసి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు.

\- నల్లగొండ

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు మన బడి, మన బస్తీ, మన బడి' పేరుతో కార్యక్రమం చేపట్టినా, నేటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదు. ఉమ్మడి జిల్లాలో తొలిదశలో 1,097పాఠశాలలను ఎంపిక చేసి రూ.450కోట్ల విలువైన పనులకు ప్రతిపాదన పంపారు. ఇప్పటి వరకు 200పాఠశాలలలోపే పనులు పూర్తి కావొస్తున్నాయి. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ' కమిటీలు ఏర్పాటుచేసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు పూనుకున్నా పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తికాలేదు. పాఠశాలల ప్రారంభం నేపథ్యంలోనే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నడుస్తోంది. మల్టీజోన్-2లో వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ ప్రక్రియ ఉండగా, ఉపాధ్యాయులంతా కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరేందుకు కొంత సమయం పట్టనుంది. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో బస్సులకు సంబంధించి నల్లగొండ జిల్లాలో మొత్తం 910 బస్సులు ఉండగా, ఇప్పటి వరకు 340 బస్సులకు ఫిట్‌నెస్ చేయించారు. మరో 570 బస్సులకు ఫిట్‌నెస్ చేయించాల్సి ఉంది.

నాలుగు, ఐదు మండలాలకు ఓ ఎంఈవో

కోర్టుల్లో కేసులు నడుస్తుండటంతో ఎంఈవోలను పూర్తి స్థాయిలో నియమించే పరిస్థితి లేదు. మండలానికి ఒకఎంఈవో ఉండాల్సి ఉండగా, నాలుగు నుంచి ఐదు మండలాలకు ఒక ఎంఈవో మాత్రమే ఉండటంతో పర్యవేక్షణ కొరవడింది. రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు ఒకొక్కరికి నాలుగు, ఐదు మండలాలు అప్పగించడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. హెచ్ఎంలకు బాధ్యతలు ఇవ్వడంతో వారు అటు పాఠశాల, ఇటు ఎంఈవోగా పూర్తి స్థాయి బాధ్యతలు నిర్వర్తించలేక సతమతమవుతున్నారు. ప్రాథమిక పాఠశాలలు,యూపీఎస్ లు, ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్కూల్స్ కస్తూర్బా పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. పాఠశాలల్లో స్కావెంజర్స్ లేక అపరిశుభ్రంగా మారుతున్నా యి. కొన్ని పాఠశాలల్లో అప్పడప్పుడూ గ్రామ పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. కొన్ని చోట్ల పంచాయతీ సిబ్బంది కొరతతో ఉపాధ్యాయులు సొంత ఖర్చుతో ప్రైవేట్ వ్యక్తులతో పాఠశాలలను శుభ్రం చేయిస్తున్నారు.

విద్యార్థులకు ఒక జత యునిఫాం

పాఠశాలల పునఃప్రారంభం రోజున కేవలం ఒక జత యునిఫాం మాత్రమే విద్యార్థులకు అందిస్తున్నారు. వాస్తవానికి ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు రెండు జతల యునిఫాం ఇవాల్సి ఉండగా కుట్టు పని పూర్తి కాలేదు. దీంతో ఒక జత యూనిఫాంనే విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజున అందించనున్నారు. నల్లగొండ జిల్లాలో 1,280 ప్రభుత్వ పాఠశాలల్లో 87,017 మందికి, సూర్యాపేట జిల్లాలో 904 పాఠశాలలకు చెందిన 53,299మందికి యునిఫాం ఇవ్వాల్సి ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇప్పటి వరకు 70 నుంచి 80శాతం మేర పాఠ్యపుస్తకాలు వచ్చాయి. నల్లగొండ జిల్లాలో 6,30,000 పైగా పుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 5లక్షల పైచిలుకు పుస్తకాలు వచ్చినట్టు సమాచారం. సూర్యాపేట జిల్లాకు 4,90,000పుస్తకాలకు సుమారు 3లక్షల వరకు పుస్తకాలు వచ్చినట్టు తెలిసింది.

పుస్తకాలు, యునిఫాం సిద్ధం



జిల్లాలో పాఠశాలలు ప్రారంభం నాటికే పుస్తకాలు, యునిఫాంలను సిద్ధంగా ఉంచాం. పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను ఆయా మండల కేంద్రాలకు, అటు నుంచి పాఠశాలలకు చేర్చాం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేశాం.

\- భిక్షపతి, నల్లగొండ డీఈవో

ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే చర్యలు

జిల్లాలో ఫిట్‌నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడిపితే చట్టపర చర్యలు తీసుకుంటాం. ఇటీవల పలు బస్సులు నిబంధనల మేరకు లేకపోవడంతో ఫిట్‌నెస్‌కు నిరాకరించాం. తిరిగి మరమ్మతులు చేయించుకుని వచ్చిన తరువాతనే ఫిట్‌నెస్ చేశాం. ఫిట్‌నెస్ లేకుండా ఎక్కడైనా బస్సులు రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తాం.

\- ఐ.లావణ్య, నల్లగొండ ఆర్టీవో

పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలి. చాలా పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు లేక తరగతి గదులు, మైదానం అపరిశుభ్రంగా ఉంటున్నాయి. గ్రామ పంచాయతీ కార్మికులు, పారిశుధ్య కార్మికులు అప్పడప్పుడు మాత్రమే శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులు, మైదానాన్ని ఉపాధ్యాయులే శుభ్రం చేసుకునే పరిస్థితి ఉంది. తక్షణమే పారిశుధ్య కార్మికులను నియమించాలి.

\- పెరుమాళ్ల వెంకటేశం, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

- విద్యార్థుల తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త
- బస్సుల కండీషన్, డ్రైవర్ల లైసెన్స్‌లను పరిశీలించాల్సిందే!



బడి బస్సు భద్రమేనా?

బడికి వేళ అయింది. ఉదయాన్నే చకచకా రెడీ అయిన చిన్నారులు భుజాన బ్యాగ్‌లు వేసుకొని, బస్సు కోసం రోడ్డుపైకి పరుగులు తీస్తుంటారు. బస్సు రాగానే ఎక్కి బడికి వెళతారు. అయితే ఈలోపు బస్సు ఆగిపోతే.. అందులోని చిన్నారులు, ఇంటివద్ద తల్లిదండ్రులకు టెన్షన్ తప్పదు. అందుకే పాఠశాలకు పంపే తల్లిదండ్రులు తప్పనిసరిగా చిన్నారుల బస్సులు, ఆటోలు కండీషన్‌లో ఉన్నాయా? లేవా? సరి చూసుకోవాలని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

\- భువనగిరి రూరల్

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే ఉద్దేశంతో ఫీజుల రూపంలో రూ.వేలు ఖర్చుచేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించకుండా పిల్లలు నిత్యం ఇంటి నుంచి పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే బడి బస్సుల సామర్థ్యం పైన దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీరే కాకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు వాటి నిర్వహణపై జాగ్రత్తలు తీసుకుంటే విద్యార్థుల ప్రయాణం సురక్షితమవుతుంది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, రవాణా శాఖ కార్యాలయంలో ఈ నెల 15లోగా ఫిట్‌నెస్ పత్రాలు సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి ఉంది. అయితే చాలా వరకు యాజమాన్యాలు అంతగా ఆసక్తి చూ పడంలేదు. విద్యార్థుల ప్రయాణ విషయంలో జాగ్రత్తలతో అన్ని పత్రాలు సమకూర్చుకొని ఫిట్‌నెస్ చేయించుకుంటేనే బస్సులు రోడ్లపైకి రావాలని రవాణా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలోని 17 మండలాలు, ఆరు మునిసిపాలిటీల పరిధిలో 274 స్కూల్ బస్సులు ఉండగా, అందులో ఇప్పటివరకు 130 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ నిర్వహించుకున్నారని, మిగతా 20 బస్సులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని ఇంకనూ 124 స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ చేయించాల్సి ఉంది.

ఇవి తప్పనిసరి

- బస్సుల్లో ఏదేని అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు వీలుగా ఫైర్ ప్రొటెక్షన్ సిలిండర్ ఉండాలి.
- పాఠశాల, కళాశాలల బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించేందుకు వీలుగా డీటీవో కార్యాలయంలో అధికారులతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, బీమా పొల్యూషన్ పత్రాలు డ్రైవర్‌కు సంబంధించి లైసెన్స్ సమర్పించి పరీక్షలు చేసుకోవాల్సి ఉంటుంది.
- పాఠశాల, కళాశాల బస్సులు నడిపే డ్రైవర్ వయస్సు 60 ఏళ్లలోపు ఉండాలి.
- డ్రైవర్‌కు ఐదేళ్ల హెవీ వాహనం నడిపిన అనుభవం ఉండాలి.
- ప్రతీ పాఠశాల బస్సుకు సహ పాఠశాల యువకుడి (అటెండర్)ను నియమించుకోవాలి.
- బస్సులోని కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసలా పైపులను విద్యార్థులు తల, చేతులు బయటపెట్టి తొంగి చూడకుండా ఉండేలా అమర్చాలి.
- బస్సు కండీషన్‌లో ఉండడమే కాకుండా బ్రేక్ వేసిన సమయంలో నాలుగు వైపులా పార్కింగ్ లైట్లు వెలగాలి.
- చిన్న పిల్లలు ఎక్కేలా మెట్ల కింద భాగంలో మరో మెట్టు ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రథమ చికిత్స బాక్సు అత్యవసర ద్వారాలు ఉండాలి.

ఫిట్‌నెస్ లేకుండా తిరిగితే బస్సులు సీజ్ చేస్తాం

పాఠశాలలు, కళాశాలలు పునర్‌ప్రారంభం అవుతున్న దృష్ట్యా బస్సులకు తప్పకుండా సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి. జిల్లాలో నమోదైన పాఠశాలల బస్సుల యజమానులు వీటిపై దృష్టి సారించాలి. ఏఒక్క పత్రం లేకుండా బస్సు రోడ్డెక్కినా చర్యలు తీసుకోవడమే కాకుండా సీజ్ చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 274 స్కూల్ బస్సులు ఉండగా, ఇప్పటి వరకు 130 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ నిర్వహించాం. మిగిలిన వారు వెంటనే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి.

\- సాయికృష్ణ, డీటీవో, యాదాద్రి భువనగిరి జిల్లా.

యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్ట్‌లకు మరమ్మతులు

ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్



ఇరిగేషన్ సీఈకి సమస్యను వివరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కనగల్, జూన్ 11: ప్రాజెక్ట్‌లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడతామని, అందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ అన్నారు. కనగల్ షైలసముద్రం చెరువును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈఈ ఆనందరావ్, డీఈ సురేష్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. చెరువు అలుగు, తూములు, షటర్లను పరిశీలించారు. పగిడిమర్రి ఫీడర్‌చానల్, కనగల్ వాగుకత్వను (ఊట్కూర్-మారెపల్లి ప్రాజెక్ట్)ను పరిశీలించారు. ఆయా ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతుల కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ, మంత్రి ఆదేశాల మేరకు వర్షం నీరు వృథాకాకుండా చెరువులు, కుంటలు నింపేందుకు అవసరమైన మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టి పూర్తిచేస్తామన్నారు. కనగల్ షైలసము ద్రం, ఇతర సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు వివరించారు. చేపల కాంట్రాక్టర్ షైలసముద్రం అలుగును ధ్వంసం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. వారి వెంట ఐబీ ఏఈలు కీర్తి, రమ, ప్రియాంక, మాజీ సర్పంచ్ సునిత, ఎండీ.హఫీజుద్దీన్, గోలి జగాల్‌రెడ్డి, పెద్దులు, శ్రవణ్‌కుమార్, ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కళ్యాణ్ చక్రవర్తి



పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

కనగల్, జూన్ 11: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. మండల కేంద్రమైన కనగల్ గ్రామంలో రూ.1.5కోట్ల నిధులతో చేపట్టిన ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అంతకుముందు ఆస్పత్రిని తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ వరూధిని, హెచ్ఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మినీ ఎత్తిపోతలకు ప్రభుత్వం లిఫ్ట్

- నిర్వహణ లోపాలు సరిదిద్దేందుకు మంత్రి ఉత్తమ్ దృష్టి
- నాలుగైదు ఎత్తిపోతలకు ఒక సిబ్బంది బృందం
- పైలట్‌గా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో అమలు

5లో..



మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి (ఫైల్)

డీసీసీబీ అవిశ్వాసంపై ఉత్కంఠ



- ఎవరి ధీమా వారిదే
- అవిశ్వాసం వీగిపోతుందనే నమ్మకంలో గొంగిడి
- నెగ్గి తీరుతామంటోన్న కాంగ్రెస్
- రసవత్తరంగా రాజకీయం

డీసీసీబీ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. తీర్మానం నెగ్గి చైర్మన్‌ను గద్దెదింపుతామని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తుంటే, డైరెక్టర్ల మద్దతు తనకే ఉందని, అవిశ్వాసం వీగిపోతుందని ధీమాలో చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నారు. ఈనెల 28న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగనుండడంతో నోటీసు ఇచ్చిన డైరెక్టర్లు కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక శిబిరానికి తరలి వెళ్లారు. అవిశ్వాసపు నోటీసు ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న డైరెక్టర్లు సమావేశంలో పాల్గొనరనే విషయంతో అవిశ్వాసంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

\- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ కావాలి. ప్రస్తుత పాలకవర్గంలో 19 మందికి డైరెక్టర్లకు 14 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేస్తే చైర్మన్ పదవి నుంచి దిగాల్సి ఉంటుంది. అయితే మొత్తం 19మంది డైరెక్టర్లలో చైర్మన్ మహేందర్‌రెడ్డితో పాటు, డైరెక్టర్లు రంగాచారి, అప్పిరెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతుండడంతో పాటు, అవిశ్వాసంపై సంతకాలు చేసిన వారిలో కూడా ఇంకా ఆరుగురు పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని,వారు తనకే మద్దతుగా నిలుస్తారనే విశ్వాసాన్ని మహేందర్‌రెడ్డి వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాసం సమావేశంలో వారు ఓటింగ్‌లో పాల్గొనకపోయినా,తీర్మానానికి అనుకూలంగా ఓటేయకపోయినా అవిశ్వాసం వీగిపోతుంది. వైస్ చైర్మన్, డైరెక్టర్లందరి సహకారంతో తాను డీసీసీబీని రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా తీర్చిదిద్దానని, నిరర్థక ఆస్తులను 11శాతంనుంచి 1.80శాతానికి తగ్గించామని, బ్యాంకు టర్నోవర్ రూ.900 కోట్ల నుంచి రూ.2400 కోట్లకు పెంచామని అంటున్నారు.గతంలో దేవరకొండ కుంభకోణం లాంటి అక్రమాలతో బ్యాంకు ప్రతిష్ఠ దెబ్బతింటే, తమ హయాంలో అలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతిష్ఠ పెంచామని, ఈ విషయాలన్నీ డైరెక్టర్లందరికీ తెలుసని, వారందరూ తనకే మద్దతుగా ఉంటారని ఆయన పేర్కొంటున్నారు.

అవిశ్వాసం నెగ్గుతామంటున్న కాంగ్రెస్

ఓ వైపు అవిశ్వాసం వీగుతుందనే ధీమాలో చైర్మన్ మహేందర్‌రెడ్డి వర్గం ఉంటే, మరో వైపు అవిశ్వాసాన్ని నెగ్గుతామని కాంగ్రెస్ డైరెక్టర్లు నమ్మకంగా కన్పిస్తున్నారు. తీర్మానంపై సంతకాలు చేసిన 14 మంది ఏకతాటిపై ఉన్నారని, మహేందర్‌రెడ్డిని గద్దె దింపడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే సమావేశం రోజున ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయననే చర్చ సాగుతోంది. సంతకాలు చేసినప్పటికీ వీరిలో ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న డైరెక్టర్లలో ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనకపోయినా తీర్మానం వీగిపోతుందని, ఆలాంటి పరిస్థితి వస్తే కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా ఉంటుందని పార్టీలో చర్చసాగుతోంది. పార్టీ మారినా, మారకపోయినా అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన డైరెక్టర్లంతా చైర్మన్‌కు వ్యతిరేకంగానే ఉన్నారని, ఆయనకు మద్దతిచ్చే ప్రసక్తే ఉండదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మొత్తంగా అవిశ్వాస ఘట్టంలో ఇప్పటికీ బీఆర్ఎస్‌లో కొనసాగే డైరెక్టర్లపైనే సర్వత్రా చర్చ నడుస్తుండడంతో, కాంగ్రెస్ ముఖ్యనేతలు ఈ చర్చకు ఫుల్‌స్టాప్ ఎలా పెడతారనే ఆసక్తి రాజకీయవర్గాల్లో సాగుతోంది.

నేటి పాలకవర్గ సమావేశం సాగేనా?

అవిశ్వాస తీర్మాన విషయం ఇలా ఉండగా, మరోవైపు ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ మేరకు బుధవారం డీసీసీబీ పాలకవర్గ సమావేశం జరగాల్సి ఉంది. అయితే 14 మంది డైరెక్టర్లు అవిశ్వాస నోటీసు ఇచ్చిన తర్వాత ప్రత్యేక శిబిరానికి తరలివెళ్లిన నేపథ్యంలో ఈ సమావేశం కొనసాగడం ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. వైస్ చైర్మన్ ఇప్పటికే విదేశాల్లో ఉండడంతో, చైర్మన్, మరో ముగ్గురు డైరెక్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. సమావేశం నిర్వహణకు అవసరమైన కోరం సభ్యులు 50శాతం ఉండాలి. అయితే కనీసం 10 మంది డైరెక్టర్లు వస్తేనే సమావేశం జరుగుతుందని, లేకపోతే వాయిదా పడుతుందని అధికారులు చెబుతున్నారు.

అవిశ్వాసం వీగడం ఖాయం



నాపై కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడం ఖాయం. మా హయాంలో బ్యాంకును ఎంత గా వృద్ధిలోకి తీసుకువచ్చామో వైస్ చైర్మన్ సహా డైరెక్టర్లందరికీ తెలిసిందే. వారందరి సహకారంతో బ్యాంకు ప్రతిష్ఠ పెంచాం. అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగించాం. రాజకీయ లక్ష్యాలతోనే అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్న డైరెక్టర్ల మద్దతు నాకే ఉంది. వారి సహకారంతో తీర్మానం వీగిపోతుందని నమ్ముతున్నా, నేనే చైర్మన్‌గా కొనసాగుతా.

\- గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలి

- చర్లగూడెం రిజర్వాయర్ పనులు అడ్డుకున్న నిర్వాసితులు
- అధికారులు నచ్చజెప్పినా వినకుండా ఆందోళన
- మర్రిగూడ మండలంలో ఘటన

మర్రిగూడ, జూన్ 11: ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం, నష్టపరిహారం చెల్లించాలని మండలంలోని చర్లగూడ రిజర్వాయర్ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిజర్వాయర్ ముంపు గ్రామ బాధితులు రిజర్వాయర్ కట్ట వద్ద మంగళవారం పనులు అడ్డుకొని, అక్కడే టెంట్ వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వాయర్‌కు అతి సమీపంలో ఉన్న నర్సిరెడ్డిగూడెం గ్రామం వర్షాలు వస్తే ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమ బాధలు, గోస చూసి వెంటనే పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కల్పించాలని కోరారు. నర్సిరెడ్డిగూడెంలోని 200 కుటుంబాలకు పునరావాసం కల్పించలేదని, అందులో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి 20మంది అర్హులన్నారు. అదేవిధంగా మరో 10మంది రైతులకు భూపరిహారం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. రిజర్వాయర్ కట్టకు అతి సమీపంలో నర్సిరెడ్డిగూడెం ఉందని, వర్షాకాలం వస్తున్నందున ముంపునకు గురవుతామని, తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అధికారులు నచ్చజెప్పినా వినని భూనిర్వాసితులు

నర్సిరెడ్డిగూడెం భూనిర్వాసితులు రిజర్వాయర్ నిర్మాణ పనులు అడ్డుకున్నారని తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్, ఇరిగేషన్ డీఈ కాశీం అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. కట్ట వద్ద పనులు అడ్డుకోవద్దని, పనులకు సహకరించాలని నచ్చజెప్పారు. 'తమకు న్యాయం జరిగితేనే పనులకు సహకరిస్తామని' నిర్వాసితులు వారికి తేల్చిచెప్పారు. పనులు జరుగుతున్న స్థలంలోనే టెంట్ వేసుకుని ఆందోళన కొనసాగించారు. వారు ఎంతకీ వినకపోవడంతో పోలీసులు, అధికారులు అక్కడినుంచి వెనుదిరిగారు. మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆందోళన చేసిన అనంతరం నిర్వాసితులు అక్కడినుంచి వెళ్లిపోయారు.



మర్రిగూడ మండలంలోని చర్లగూడెం రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశం వద్ద టెంట్ వేసుకుని ఆందోళన చేస్తున్న నర్సిరెడ్డిగూడెం బాధితులు

2015 నుంచి రిజర్వాయర్ నిర్మాణ పనులు

11 టీఎంసీల సామర్థ్యంతో చర్లగూడెం రిజర్వాయర్‌ను 3,450 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించాలని 2015 సంవత్సరంలో ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశానికి సమీపంలో ఉన్న వెంకేపల్లి, వెంకేపల్లితండా, చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం, రాంరెడ్డిపల్లి, ఖుదాబక్‌పల్లి, శివన్నగూడెం గ్రామాల నుంచి 3,450ఎకరాల భూమి సేకరించారు. ఇందులో వెంకేపల్లి, వెంకేపల్లితండా, చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం గ్రామాల భూములు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. రాంరెడ్డిపల్లి, ఖుదాబక్షపల్లి, శివన్నగూడెం గ్రామాలకు చెందిన రైతుల నుంచి భూములు సేకరించారు. వీరందరికీ భూ పరిహారం వచ్చింది. ఎకరానికి మొదటి విడత రూ.4.15లక్షల పరిహారం అందింది. నష్టపరిహారం సరిపోవడం లేదని రెండు నెలల పాటు ధర్నా చేయటంతో అప్పటి ప్రభుత్వం మరో రూ.లక్ష పెంచి ఎకరానికి మొత్తం రూ. 5.15లక్షలు ఇచ్చింది. పూర్తిగా ముంపునకు గురవుతున్న వెంకేపల్లి, వెంకేపల్లితండా, చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం గ్రామాల భూనిర్వాసితులకు పునరావాసం చూపించాల్సి ఉంది. వర్షాకాలం వస్తున్నందున ముంపునకు గురవుతామని తమకు పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ ప్రతిపాదిత ప్రదేశానికి నర్సిరెడ్డిగూడెం అతి దగ్గరలో ఉండటంతో ఆందోళనకు దిగారు.

డీలర్లు సమయ పాలన పాటించాలి

పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కమల్‌పాషా

మర్రిగూడ, జూన్ 11: చౌకధరల డీలర్లు సమయ పాలన పాటించి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కమల్ పాషా అన్నారు. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో మర్రిగూడ, వట్టిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ చౌకధరల దుకాణాలను తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను, బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటిస్తూ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. వీరి వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ ఎస్ఐ చారి, నాంపల్లి పౌరసరఫరాలశాఖ ఆర్ఐ అబీద్, మర్రిగూడ, వట్టపల్లి డీలర్లు ఉన్నారు.



మర్రిగూడలో చౌకధరల దుకాణాన్ని తనిఖీచేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కమల్‌పాషా

ఆస్పత్రిలో అక్రమాలపై విచారణ

చౌటుప్పల్ టౌన్, జూన్ 11: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగుల నుంచి వసూళ్లు చేస్తున్న ఘటనపై డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాత్రు విచారణ జరిపారు. దీంతో వైద్యులు, సిబ్బందిలో కలవరం మొదలైంది. ఆస్పత్రిలో అక్రమ వసూళ్లతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యుల వ్యవహారంపై స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుధాకర్ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో మాత్రు నాయక్ విచారణ నిమిత్తం చౌటుప్పల్‌కు వచ్చారు.

సుధాకర్ చేసిన ఫిర్యాదులోని అంశాలు..

- ఆస్పత్రిలో గర్భిణీ ప్రసవంకోసం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకు వెళ్లేందుకు రూ.1500, కేసీఆర్ కిట్ కోసం రూ.500, జనన నివేదిక సమాచారం కోసం రూ.500 వసూలు చేస్తున్నారు.
- ఆస్పత్రిలో డ్యూటీచేసే డాక్టర్లకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉండడంతో సమయానికి డ్యూటీకి రావడం లేదు.
- బయోమెట్రిక్‌ను వినియోగించకపోవడంతో ఈ ఆస్పత్రి డాక్టర్లు సమయ పాలన పాటించడంలేదు.
- సూపరింటెండెంట్‌తోపాటు కొంతమంది వైద్యులకు ప్రైవేట్ ఆసుపత్రులున్నాయి. కాంట్రాక్టర్‌తో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వ్యక్తిగతంగా గొడవలకు దిగుతున్నారు. దీంతో అత్యవసర సేవలను నిలిపి వేసి ధర్నాలు చేస్తుండడంతో రోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.

నివేదికను కమిషనర్‌కు అందజేస్తా : మాత్రునాయక్



మాట్లాడుతున్న మాత్రునాయక్

చౌటుప్పల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగుల నుంచి లంచాలు తీసుకుంటున్నారన్న ఫిర్యాదు మేరకు నిర్వహించిన విచారణ నివేదికను రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ కమిషనర్‌కు అందజేస్తామని నల్లగొండ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాత్రు తెలిపారు. డాక్టర్ సుధాకర్ చేసిన పలు ఫిర్యాదులపై మంగళవారం ఆరోగ్య కేంద్రంలో మాత్రు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అలివేలుపై డాక్టర్ సుధాకర్ పలు రకాల ఫిర్యాదులు చేశారని, అదేవిధంగా ఎఫ్ఎన్‌వో సావిత్రిపై కూడా కొన్ని ఆరోపణలు వచ్చాయన్నారు. విచారణ నివేదికను కమిషనర్‌కు అందజేస్తామన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

● యాదగిరీశుడి సన్నిధిలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూన్ 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని ఉత్సవమూర్తులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణపర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో పర్వతవర్థినీ సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్ర హవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. వివిధ విభాగాల ద్వారా రూ. 37,96,361 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

మినీ ఎత్తిపోతలకు ప్రభుత్వం లిఫ్ట్

- నిర్వహణ లోపాలు సరిదిద్దేందుకు మంత్రి ఉత్తమ్ దృష్టి
- నిర్వహణకు సిబ్బంది... నెలాఖరులోగా నియామకాలు
- నాలుగైదు ఎత్తిపోతలకు ఒక సిబ్బంది బృందం
- పైలట్‌గా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో అమలు
- రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతలను వినియోగంలోకి తేవడమే లక్ష్యం


మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై కోదాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి (ఫైల్)


సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని ఎల్-34 ఎత్తిపోతల పథకం

నల్లగొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6.50లక్షల ఎకరాలకు సాగు నీరందించే మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణ లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, రైతులతో కలిసి సమీక్ష నిర్వహించి ఎత్తిపోతల పథకాలు సక్రమంగా నడిచేందుకు తీసుకోవల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణలో ఎదురవుతున్న లోపాలను సరిచేయడంతోపాటు, ఎత్తిపోతల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సిబ్బంది, సాంకేతికేతర సిబ్బందిని నియమించాలని నిర్ణయించారు. నాలుగైదు ఎత్తిపోతల పథకాలకు ఒక సిబ్బంది బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, చిన్న చిన్న మరమ్మతులు తలెత్తినప్పుడు వాటిని తక్షణం పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కేటాయింపునకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు.

నిరుపయోగంగా...

కోట్లాది రూపాయల వ్యయంతో మినీ ఎత్తిపోతల పథకాలను నిర్మించినా, వాటిని నడిపేందుకు శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, ఆపరేటర్లు, పంప్‌హౌస్‌ల వద్ద భద్రతా సిబ్బంది లేక పోవడంతో లిఫ్టులు (మినీ ఎత్తిపోతల పథకాలు) తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దాదాపు 20 ఏళ్ల క్రితం వరకు వీటిని నిర్మించడం, ఆ తర్వాత వాటి నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కూడా రాష్ట్ర నీటిపారుదల సంస్థ చేపట్టేది. ఆ తర్వాత పాలనాపరమైన మార్పులతో ఎత్తిపోతల పథకాలను నిర్వహణను రైతు కమిటీలకు అప్పగించారు. అప్పటినుంచి రైతుల కష్టాలు మొదలయ్యాయి. సాంకేతికపరమైన అవగాహన రైతులకు లేకపోవడం, గ్రామాల్లో అందుబాటులో ఉండే ఎలక్ట్రీషియన్లు, మెకానిక్‌లతో లిఫ్టులను నడుపుతుండడం, అదీ రైతులకు భారంగా మారడంతో మెజార్టీ ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రధానంగా హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో నాగార్జునసాగర్ ఎడమకాల్వపైనా, స్థానిక వాగులు, చెరువులపైనా 100కు పైగా మినీ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్షన్నర ఎకరాల ఆయకట్టుకు ఈ లిఫ్టులు నీరందించాల్సి ఉంటే, నిర్వహణ లోపంతో వాటిల్లో ఎక్కువభాగం నడవకపోగా, నడిచేవి కూడా అసంపూర్తి ఆయకట్టుకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రపంచబ్యాంకు నిధులతో లిఫ్టుల ఆధునికీకరణ చేపట్టినా పూర్తి ప్రయోజనం నెరవేరలేదు. అంతేకాకుండా కాల్వల మరమ్మతులు చేపట్టలేదని, నిర్వహణ సిబ్బందిపై ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఎక్కడవేసిన గొంగడి అనే రీతిలో ఎత్తిపోతల పథకాల పరిస్థితి తయారైంది.

సాంకేతిక సిబ్బంది బృందాల నియామకం

క్షేత్రస్థాయిలో మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణలో ఎదురయ్యే లోపాలను తెలుసుకునేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇటీవల కోదాడలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 57ఎత్తిపోతల పథకాల పరిధిలోని రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వచ్చిన అభిప్రాయాల మేరకు ప్రధానంగా ఎత్తిపోతల పథకాలకు నిర్వహణ సిబ్బందిని నియమించాలని నిర్ణయించారు. రైతు కమిటీలతో సంబంధం లేకుండా ఇరిగేషన్ శాఖ ద్వారానే నాలుగైదు ఎత్తిపోతల పథకాలకు కలిపి ఒక ఆపరేటర్, ఒక ఫిట్టర్, ఒక ఎలక్ట్రీషియన్, మెకానిక్‌ను నియమించాలని నిర్ణయించారు. ఈ బృందంతో పాటు ప్రతి ఎత్తిపోతల వద్ద ఒక వాచ్‌మన్, కాల్వల ద్వారా నీటిని దుర్వినియోగం చేయకుండా సక్రమంగా వినియోగించేలా చూడడంతో పాటు, కాల్వల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అవసరమైన లస్కర్‌లను కూడా నియమించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆయా ఎత్తిపోతల పథకాల వద్ద రైతు కమిటీలు నియమించిన సాంకేతిక సిబ్బందికి నైపుణ్యం ఉంటే వారినే ఈ బృందాల్లో తీసుకోవాలని, లేకపోతే నైపుణ్యం, అర్హత కలిగినవారిని నియమించాలని నిర్ణయించారు. ఇరిగేషన్‌శాఖ ద్వారానే వీరిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కానీ, లేక ఇతర పద్ధతుల్లో నియమించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రైతు కమిటీలతో సంబంధం లేకుండానే వీరికి నేరుగా ఇరిగేషన్‌శాఖ ద్వారానే వేతనాలు అందించాలనే సూచన కూడా సమావేశంలో వచ్చింది. ఈ నెలాఖరులోగా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలోని 57 ఎత్తిపోతల పథకాలకు తొలుత పైలెట్‌గా ఈ కార్యాచరణ అమలుచేసి లోటుపాట్లను సమీక్షించనున్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే రీతిలో అన్ని మినీ ఎత్తిపోతల పథకాలకు నిర్వహణ సిబ్బంది నియామకం, నిర్వహణకు నిధుల కేటాయింపు చేపడతామని తద్వారా అన్ని మినీ ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో
యువకుడి మృతి

● మృతదేహాన్ని ఛత్తీస్‌ఘడ్‌కు తరలించిన కూలీలు


రాంసింగ్ మృతదేహం

హుజూర్‌నగర్, జూన్ 11: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ సమీపంలోని ఎస్ఎస్‌పీ కాల్వ ఆధునికీకరణ పనులు చేసేందుకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లా కూకనర్ గ్రామానికి చెందిన రాంసింగ్ బాగెల్ (25) మంగళవారం ఉదయం 11 గంటలకు వచ్చాడు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లోకి దిగిన రాంసింగ్ అక్కడ అల్యూమినియం మెజర్‌మెంట్స్ స్టాఫ్‌తో కొలతలు పూర్తిచేసుకుని బయటకు వస్తున్నాడు. ఈక్రమంలో అల్యూమినియం కొలతల పరికరం 11కేవీ విద్యుత్ వైరుకు తగలడంతో రాంసింగ్ విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో అక్కడున్న వారు 108లో ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. కాంట్రాక్టర్ బత్తుల నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పొట్ట కూటికోసం తెలంగాణకు వచ్చిన రాంసింగ్ మృతి చెందడంతో తోటి కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా రామ్‌సింగ్ మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి ఛత్తీస్‌ఘడ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి

● చౌటుప్పల్ చేనేత సహకార సంఘం ఎదుట ధర్నా


ఆందోళన నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు, కార్మికులు

చౌటుప్పల్ టౌన్, జూన్ 11: చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. పాలకవర్గం అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక చేనేత సహకార సంఘం ఎదుట అఖిల పక్షం నాయకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ, చేనేత వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కార్మికులకు నూతన ఆర్డర్‌ఫాం నమోదు చేయాలని ఎన్నిమార్లు కోరినా పాలకవర్గం పట్టించుకోకుండా పక్షపాతంగా వ్యవహరిస్తోందన్నారు. అదే పాలకవర్గానికి సంబంధించిన వ్యక్తులకు మాత్రం ఏకపక్షంగా ఆర్డర్‌ఫాంలను నమోదుచేసి వాటా ధనాన్ని తీసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్మికులకు పనులు కల్పించకుండా పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తమకు అనుకూలమైన కొంతమందికి పనులను కల్పిస్తూ పేద కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. సంఘానికి చెందిన విలువైన ఆస్తులను విక్రయించేందుకు పాలకవర్గం ప్రయత్నిస్తోందని, సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే కార్మికులను బీఆర్ఎస్‌కు చెందిన సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ కందకట్ల భిక్షపతి బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు గోశిక స్వామి, గోశిక రవి, గుర్రం వెంకటేశం, గుర్రం నర్సింహ, వనం ధనుంజయ్య, గోశిక భిక్షపతి, బడుగు కృష్ణ, గోశిక నరహరి, గోశిక భాస్కర్, గోశిక నర్సింహ, గుర్రం మారయ్య, శంకరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

యాదగిరీశుడి వీఐపీ దర్శనాలకు క్యూలైన్లు

● రూ.26లక్షలతో ప్రతిపాదనలు ● అందుబాటులోకి తాత్కాలిక షెడ్డు ● యాదగిరిగుట్టపై భక్తులకు ఏర్పాట్లు


ఆలయ తూర్పు దిశలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు

భువనగిరి అర్బన్, జూన్ 11: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చే వీఐపీ టికెట్ భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇన్నాళ్లు వీఐపీ టికెట్(రూ.150) తీసుకున్న భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన క్యూలైన్ లేదు. వీరి సంఖ్య కొద్దిగానే ఉండడంతో దర్శనానికి వెంటనే అనుమతించే వారు. దీంతో వీరు తూర్పు రాజగోపురం ఎదురుగా, ప్రాకార మండపం నుంచి ఆలయంలోకి ప్రవేశించేవారు. రానురాను వీఐపీ భక్తుల తాకిడి పెరుగుతుండడంతో వీరికోసం ప్రత్యేకంగా క్యూలైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ధర్మదర్శనానికి వచ్చే భక్తులు యాదగిరిగుట్ట కొండపై ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న క్యూకాంప్లెక్స్ ద్వారా తూర్పు రాజగోపురం వద్దకు చేరుకుంటారు. వీఐపీ దర్శన భక్తులు ఉత్తర దిశలోని ప్రాకార మండపం నుంచి తూర్పు రాజగోపురం వద్దకు చేరుకుంటారు. రద్దీ ఎక్కువగా ఉన్నపుడు భక్తులు గుడి బయట వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో ఈశాన్య దిక్కు నుంచి తూర్పు రాజగోపురం వరకు షెడ్లు నిర్మించి అందులో క్యూలైన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ధర్మదర్శనం, వీఐపీ దర్శనంలో భక్తులను వేర్వేరు క్యూలైన్లలో ఆలయంలోకి అనుమతిస్తారు.


భక్తుల తాకిడి పెరుగుతుండడంతో..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రతీ శుక్ర, శని, ఆది వారాలతోపాటు ప్రత్యేక రోజుల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. దీంతో కొండపైన తిరువీధులు, ఆలయ పరిసరాలు, బస్టాండ్ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వీరికి ఎండ, వానల నుంచి రక్షణ కోసం ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు తగిన ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటితోపాటు ఒక్కోటి పాత ఆచారాలను కొండపైన తిరిగి ప్రవేశపెట్టేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తరుణంలో భక్తులకు ఎండ, వాన నుంచి ఉపశమనం, కాసేపు సేద తీరేందుకు ఆలయ ఉత్తరదిశలో భారీ షెడ్డును అధికారులు ఈ సంవత్సరం ఏప్రిల్‌లో అందుబాటులోకి తెచ్చారు. కాగా, ఇన్నేళ్లుగా రూ.150 టికెటు పొందిన వీఐపీ దర్శనం భక్తులకు ఇప్పటివరకు ప్రత్యేక దర్శన క్యూలైన్ లేదు. టికెట్ తీసుకున్న వెంటనే ప్రాకార మండపం నుంచి ఆలయంలోకి ప్రవేశించే వారు. అయితే రోజురోజుకూ వీఐపీ భక్తుల రద్దీ కూడా పెరుగుతుండడంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వీరికోసం తూర్పు రాజగోపురం ఎదురుగా ఎండ, వానల నుంచి రక్షణ కల్పించేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయనుండగా, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈ షెడ్డు కిందిభాగం నుంచి పాత రేకులు కనిపించకుండా నూతన తెల్లని వస్త్రాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు కంచె ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా షెడ్డుకు పాత రేకులు బిగించడంతో ఆలయ శోభ తగ్గిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఉత్తర దిశలోని షెడ్డు మాదిరిగా తూర్పు దిశలో కూడా శాశ్వత షెడ్డును అందుబాటులోకి తేనున్నట్లు ఆలయ సివిల్ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం వేసిన రేకులు అద్దె ప్రాతిపదికన తెచ్చామని, శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు పూర్తి కాగానే వాటిని తొలగిస్తామన్నారు.

రూ.26లక్షలతో ప్రతిపాదనలు

ప్రస్తుతం అందుబాటులోని షెడ్డు సుమారు 72/30 మీటర్ల వైశాల్యంలో ఏర్పాటు చేయగా, శాశ్వత షెడ్డు నిర్మాణం కోసం కమిషనర్ అనుమతికోసం రూ. 26లక్షలతో ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక షెడ్డు పాత ఇనుప రేకులతో ఏర్పాటు చేయగా, ఇక్కడ శాశ్వత దర్శన క్యూలైన్ల కోసం పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తి కాగానే, మరో నెల రోజుల్లో వీఐపీ దర్శన భక్తులు కొత్తగా ఏర్పాటు చేసిన క్యూలైన్ గుండా ఆలయంలోనికి ప్రవేశించవచ్చు. ఇదిలా ఉంటే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును, శాశ్వత పనుల కోసం నిధులు మంజూరై పనులు ప్రారంభించగానే తొలగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.


ఆలయ శోభకు అడ్డుగా షెడ్డు



పాత రేకులతో ఏర్పాటు చేసిన షెడ్డు ఆలయ శోభకు అడ్డుగా మారింది. అధికసంఖ్యలో క్షేత్ర దర్శనానికి భక్తులు వస్తున్నారు. అదేస్థాయిలో ఆదాయం సమకూరుతుంది. పాత రేకులు ఏర్పాటు చేయడం సరైంది కాదు. తూర్పు రాజగోపురం ద్వారం ఎదురుగా, అలాగే ఉత్తర దిశలో శాశ్వతంగా షెడ్డు ఏర్పాటు చేసినప్పటికీ భక్తులు సేద తీరేందుకు బాగుంది. కానీ, ఆలయ సహజత్వానికి అడ్డుగా మారింది.

వి. శ్రీనివాస్, వరంగల్

టెండర్ ప్రక్రియ పూర్తికాగానే నిర్మిస్తాం



భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణకు మాత్రమే అద్దె ప్రాతిపదికన తెచ్చిన పాత రేకులతో షెడ్డును ఏర్పాటు చేశాం. శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు రూ.26లక్షలతో ప్రతిపాదనలు పంపాం. ఇన్ని రోజులు ఎన్నికల కోడ్ ఉన్నందున దేవదాయ శాఖ కమిషనర్ అనుమతికి పంపలేదు. ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రతిపాదనలు పంపాం. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే శాశ్వతంగా షెడ్డు నిర్మాణం చేస్తాం.

● దయాకర్‌రెడ్డి, సివిల్ విభాగం ఈ ఈ, యాదగిరిగుట్ట దేవస్థానం

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.5050
ప్రస్తుత నీటి మట్టం	504.70 అడుగులు
టీఎంసీలు	122.8483
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	800 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	0.90 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	637.30 అడుగులు
టీఎంసీలు	2.57
ఇన్‌ఫ్లో	764 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	84 క్యూసెక్కులు

- కేతేపల్లి

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాత సేవ: ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

చెర్వుగట్టు ఆలయ వేళలు




ఉదయం: 5.00 గంటలకు తెరుస్తారు
సుప్రభాతసేవ మరియు నాదస్వరం: ఉదయం 5.00 నుంచి 5.30 వరకు
నిజాభిషేకం: ఉదయం 5.30నుంచి 6.30గంటల వరకు
దర్శనాలు: ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు
నివేదన: మధ్యాహ్నం 12.00 గంటలకు మహానివేదన
దర్శనం: 12.10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
మూసివేత: మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేత
సాయంత్రం: 3గంటలకు తెరుచుకోనున్న ఆలయం
దర్శనాలు: సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దర్శనాలు
ద్వార బంధనం: సాయంత్రం 7.30 గంటలకు ప్రదోశకాల పూజలు మహా ఫల నివేదన, హారతి అనంతరం ద్వార బంధనం

● నార్కట్‌పల్లి

పత్తి సాగులో మెళకువలు

● కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు



త్రిపురారం, జూన్ 11: పత్తి సాగులో పాటించాల్సిన మెళకువలపై కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సలహాలు, సూచనలిచ్చారు.

● తొలకరిలో కనీసం 60 మి.మీ వర్షం కురిసిన తర్వాత పత్తి విత్తనాలు విత్తితే భూమిలో వేడి తగ్గి మొలక శాతం బాగుంటుంది.

● వర్షాధారంగా పత్తిని సాగుచేసినప్పుడు జూన్, జూలై నెలల్లో విత్తుకోవచ్చు.

● వర్షాధారంగా జూలై 20 తర్వాత విత్తితే దిగుబడి తగ్గుతుంది. తేలిక నేలల్లో తప్పని సరిగా పత్తిని సాగు చేసినప్పుడు మొక్కల సంఖ్య మాములు కంటే ఎక్కువగా ఉండేట్లు దగ్గరగా విత్తుకోవాలి.

● ప్రాంతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్, మహారాష్ట్ర వారు రూపొందించిన అధిక సాంద్రత పత్తిలో లాభసాటిగా ఉందని రైతులు చెబుతున్నారు. ఈ అధిక సాంద్రత పత్తిలో మొక్కకు మొక్కకు మధ్య 15 సెం.మీ సాళ్ళ మధ్య 90 సెం.మీ దూరంలో మొక్కలను నాటుకోవటం ద్వారా మొక్కల సాంద్రత సాధారణ పద్ధతి కంటే 2-3 రెట్లు పెరుగుతుంది. అదేవిధంగా దిగుబడి 12 నుంచి 14 క్వింటాళ్లు ఎకరాకు వస్తుంది.

15న పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

నల్లగొండ, జూన్ 11: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఈ నెల 15న ఆర్ట్స్ కళాశాల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కళాశాల అడ్మిషన్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షకు రావాలన్నారు.

నేడు, రేపు ధ్రువపత్రాల పరిశీలన

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా బుధ, గురువారాల్లో వైద్య ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు డీఈవో భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఎంటైటిల్మెంట్ పాయింట్స్ పొందడానికి వైద్య ధ్రువపత్రాలను తమ మెడికల్ రిపోర్టుతో హాజరుకావాలని తెలిపారు. జిల్లా మెడికల్ బోర్డు రెండు రోజులపాటు వైద్య పరిశీలన నిర్వహిస్తున్నందున సమయానికి హాజరు కావాలన్నారు.

పదోన్నతుల కౌన్సిలింగ్‌కు..

జిల్లాలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ), సమాంతర కేడర్‌లో పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్(స్పెషల్ బీఈడీ) చేసిన ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సిలింగ్‌కు సంబంధించి బుధవారం అర్హత సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు సర్వీస్ పుస్తకాలతో ఉదయం 10గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

16న విశ్వబ్రాహ్మణ సత్ర కమిటీ ఎన్నిక

మఠంపల్లి, జూన్ 11: సూర్యాపేట జిల్లా మట్టపల్లి మహాక్షేత్రంలోని విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్ర కమిటీ ఎన్నిక ఈ నెల 16న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఉద్దోజు సూర్యనారాయణాచారి అన్నారు. మంగళవారం మట్టపల్లి క్షేత్రంలో జరిగిన సత్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఎల్లారెడ్డిగూడెంలో సర్వీస్ రోడ్లకు మోక్షం!



ప్రమాదకరంగా ఉన్న ఎల్లారెడ్డిగూడెం బస్టేజీ వద్ద చెర్వుగట్టు వెళ్లే క్రాసింగ్

- మంత్రి కోమటిరెడ్డి ఆదేశంతో కదిలిన అధికారులు
- ఎట్టకేలకు ప్రారంభమైన విస్తరణ పనులు
- ఇరువైపులా 2 మీటర్ల చొప్పున డ్రైన్, పైప్‌లైన్‌లు
- స్థల సేకరణ బాధితులకు ఇప్పటికే నష్టపరిహారం అందజేత
- అదనపు స్థల సేకరణ కోసం బాధితులతో నేడో రేపో సమావేశం

నార్కట్‌పల్లి, జూన్ 11: మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా ఇదే మండలానికి చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉండటంతో సర్వీస్ రోడ్ల నిర్మాణానికి మార్గం సుగమమైంది. 2013లో నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారి విస్తరణ నిర్మాణంలో భాగంగా ఎల్లారెడ్డిగూడెం వద్ద ఫ్లైఓవర్ రోడ్డు వేశారు. కానీ గడిచిన పదేళ్ల కాలంలో సర్వీస్ రోడ్లను వేయకపోవడంతో ఎల్లారెడ్డిగూడెం బస్టాప్ నుంచి చెర్వుగట్టుకు వెళ్లే జంక్షన్ వద్ద రోడ్డు దాటే క్రమంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుని పదుల సంఖ్యలో మృతి చెందగా మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. అయితే ఎల్లారెడ్డిగూడెం, చెర్వుగట్టు గ్రామస్థులు, రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలు ప్రమాద సంఘటనలు జరిగిన ప్రతీసారీ జంక్షన్ వద్ద రోడ్డెక్కి ఆందోళన చేయడం... పోలీసులు సర్దిచెప్పడంతో విరమించడం పరిపాటిగా మారిందే తప్ప సర్వీస్ రోడ్లు నిర్మాణం పూర్తికాలేదు. సర్వీస్ రోడ్డు విస్తరణలో భాగంగా గత బీఆర్ఎస్ పాలనలో నిర్వాసితులకు నష్టపరిహారం అందినా పనులు చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు మంత్రిగా బాధ్యతలు తీసుకోవడంతో ఇదే గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి చొరవ తీసుకుని ఎల్లారెడ్డిగూడెంలో సర్వీస్ రోడ్ల సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లాడు. స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించడంతో ఆర్‌అండ్‌బీ సీఈ మధుసూదన్‌రెడ్డి స్వయంగా ఎల్లారెడ్డిగూడెంలో సర్వీస్ రోడ్డు విస్తరణ ప్రదేశాన్ని పరిశీలించి రోడ్డు విస్తరణ పనులు చేసిన (నామ్ వే సంస్థ) సంస్థ ఉద్యోగులకు చేసిన సూచన మేరకు ఎట్టకేలకు సర్వీస్ రోడ్డు పనులను ప్రారంభించారు.

రూ.1.50 కోట్లు నష్టపరిహారం చెల్లింపు

సర్వీస్ రోడ్ల విస్తరణకు అదనంగా స్థలాన్ని సేకరించాల్సి ఉంది. తొలుత చేసిన ప్రతిపాదనల్లో మార్పులు చేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన పదేళ్ల నాటి ట్రాఫిక్ సెన్సెస్ బట్టి ఇరువైపులా 5.75 మీటర్ల చొప్పున సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు. ఇందులో 3.75మీటర్ల వెడల్పుతో రోడ్డు, 1మీటరు వెడల్పుతో డ్రైనేజీ, 1 మీటరు వెడల్పులో పైప్‌లైన్లు వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థలసేకరణ కోసం ఇరువైపు లా 155 మంది నిర్వాసిత బాధితులను గుర్తించి ప్రభు త్వ రిజిస్ట్రేషన్ రేటు ప్రకారం రెండింతలు పెంచి సు మారు రూ.1.50 కోట్లను నష్టపరిహారంగా ఇప్పటికే చెల్లించారు.

ఆర్చీ వద్ద క్రాసింగ్‌పై రాని స్పష్టత

ఎల్లారెడ్డిగూడెం బస్టేజీ నుంచి చెర్వుగట్టుకు వెళ్లే రోడ్డు వద్ద ఉన్న క్రాసింగ్‌ను మూసివేయాలా? తెరిచి ఉంచాలా? అనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత మెయిన్ రోడ్డుకు ఎక్కకుండా గ్రిల్స్‌తో మూసివేయనున్నారు. కేవలం ఒకటి రెండు చోట్ల మాత్రమే మనుషులు దాటేలా గ్రిల్స్‌లో కొంచెం గ్యాప్ ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. బస్టేజీ నుంచి చెర్వుగట్టుకు వెళ్లే ఆర్చీ వద్ద క్రాసింగ్‌ను మూసివేయాలా లేక తెరిచే ఉంచాలా అనే విషయంలో మాత్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని నామ్‌వే సిబ్బంది చెబుతున్నారు.

బాధితులతో సమావేశం?

సర్వీస్ రోడ్ల విస్తరణ కోసం ఇప్పటికే గుర్తించి సేకరించిన స్థలానికి అదనంగా మరికొంత స్థలాన్ని సేకరించాల్సి ఉంది. ఇందుకోసం బాధితులతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. సర్వీస్ రోడ్డు ఇంతకు ముందు నిర్ణయించిన దానికన్నా 2 మీటర్లు పెంచాల్సిన అవసరాన్ని నిర్వాసిత బాధితులకు వివరించి వారిని ఒప్పించనున్నారు.



ఎల్లారెడ్డిగూడెంలో సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ప్రారంభమైన కూల్చివేతలు (ఫైల్)

క్రాసింగ్ వద్ద వీయూపీ నిర్మించాలి



ఎల్లారెడ్డిగూడెం బస్టేజీ వద్ద ప్రస్తుతం చెర్వుగట్టుకు వెళ్లే క్రాసింగ్ ప్రదేశంలో భవిష్యత్తులోనైనా వీయూపీ నిర్మించాలి. జిల్లాలోనే అతిపెద్ద క్షేత్రం కావడంతో రానున్న మరో పదేళ్లలో చెర్వుగట్టు క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరగనున్నందున ఫ్లైఓవర్ పై క్రాసింగ్‌ను వీయూపీగా మార్చాలని మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంలను గ్రామస్థుల తరపున కోరుతున్నాం. విస్తరణలో స్థలాలు కోల్పోతున్న బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించేందుకు మంత్రి, ఎమ్మెల్యేలు సహకరించాలి.

– వడ్డే భూపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డిగూడెం

సర్వీస్ రోడ్డు వెడల్పు పెంపునకు అదనంగా భూ సేకరణ

సర్వీస్ రోడ్ల వెడల్పును మరింత విస్తరించాలని నిర్ణయించారు. పదేళ్ల క్రితం అప్పటి ట్రాఫిక్ సెన్సెస్ ప్రకారం సర్వీస్ రోడ్డును 3.75 మీటర్ల వెడల్పుగా చేయాలని ప్రతిపాదించారు. కానీ గడిచిన పదేళ్లలో చెర్వుగట్టు క్షేత్రానికి భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో సర్వీస్ రోడ్డు వెడల్పును 3.75 మీటర్ల నుంచి 5.50 మీటర్లకు పెంచాలని తాజాగా నిర్ణయించారు. పెంచిన ప్రకారమైతే ఇరువైపులా సర్వీస్ రోడ్డు విస్తరణ 7.50 మీటర్లకు పెరిగి విశాలంగా మారుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం సీఈ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అధికారుల బృందం కూడా పరిశీలన చేసింది. ఇలా అదనపు భూ సేకరణ చేయాల్సి వస్తే మరో 40 గుంటల భూమి 67 నిర్మాణాలను తొలగించాల్సిందిగా నామ్‌వే ఉద్యోగులు గుర్తించారు.

తాగునీటి సరఫరా సర్వే పకడ్బందీగా ఉండాలి



మిషన్ భగీరథ ట్యాప్ సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు

కేతేపల్లి, జూన్ 11: ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా ట్యాప్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. కేతేపల్లి మండలకేంద్రం, కొర్లపహాడ్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను మంగళవారం పర్యవేక్షించారు. ప్రతి ఇంటికీ విధిగా నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నల్లా నీటి సరఫరాపై ఇంటింటి సర్వే నిర్వహిస్తుందన్నారు. దీంతో ఏ ఇంటికి గ్రామపంచాయతీ నీరు అందుతుంది, ఏ ఇంటికి మిషన్‌భగీరథ నీరు అందుతుంది, ఇంకా ఎన్ని ఇళ్ల నీరు అందడం లేదనేది స్పష్టమవుతుందన్నారు. గ్రామాల్లో సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఆయన వెంట కేతేపల్లి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మౌనిక, పంచాయితీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, యాదయ్య ఉన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

దేవరకొండ, జూన్ 11: విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా సిలబస్ అమలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ రూపొందించిన సిలబస్ కాకుండా సొంత సిలబస్ బోధించడం చట్టాన్ని అతిక్రమించినట్లు అవుతుందని పేర్కొన్నారు. అధికారులు తనిఖీలు చేసి ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషిచేయాలి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో రాము

తిరుమలగిరి(సాగర్), జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో తరి రాము కోరారు. మండలకేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందించాలన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు, కేజీబీవీ పాఠశాలకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ కొనమంచలి శ్రీనివాస్, హెచ్‌ఎంలు కరుముల శ్రీనవాస్‌రెడ్డి, సత్యనారాయణ, రాపోలు పరమేష్, సీఆర్పీలు నాగసిద్దార్థ, శ్రీనివాస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శోభా, ఐఆర్టీ కోఆర్డినేటర్ శ్వేత ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని హైస్కూల్ జీహెచ్‌ఎం ధర్మానాయక్ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాంధీనగర్, షాబూనగర్ శివారు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం, ఉత్తమ బోధన లభిస్తుందన్నారు. ఆయనవెంట జనార్ధన్‌రెడ్డి, తావుర్యా, కృష్ణకాంత్‌నాయక్, పరశురాములు, అశ్వినీ, అనిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి చొరవ చూపాలి



సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ను కలిసిన చొక్కారావు

నల్లగొండ, జూన్ 11: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం, డ్వాబ్ జనరల్ సెక్రటరీ పొనుగోటి చొక్కారావు కోరా రు. పార్లమెంట్ ఎన్నికల్లో 100శాతం దివ్యాంగుల ఓట్లు పడే విధంగా కృషి చేసి న సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావును కలిసి అభినందించారు. జిల్లాలో సాధించిన విజయాన్ని ఇతర జిల్లాలు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కర్నాటి శ్రీనివాస్, సంఘం బాధ్యులు దామోదర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'అనుమతిలేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

కొండమల్లేపల్లి, జూన్ 11: ప్రభుత్వ అనుమతి లేకుండా కొండమల్లేపల్లి మండలకేంద్రంలో నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే పాఠశాలను నడిపిస్తూ ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ, రమావత్ లక్ష్మణ్, వెంకటేష్, అఖిల్, ఆకాష్, సిరాజ్, రాజునాయక్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

పెద్దవూర, జూన్ 11: పిడుగుపాటుకు రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని గేమ్యానాయక్‌తండా పరిధిలోని జగ్రాతండా గ్రామంలో సోమవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు నేనావత్ సామ్య తనకున్న రెండు ఆవులను రోజుమాదిరిగానే పొలంలో మేత మేపుతుండగా మెరుపులతో కూడిన వర్షం కురువగా ఒక్కసారిగా పిడుగు పడడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.90వేల ఉంటుందని బాధితుడు తెలిపాడు. రెండు ఆవులు మృతిచెందడంతో తాను జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం తనకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

పేదింటి ఆడపడుచులను ఆదుకోవడమే లక్ష్యం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూన్ 11: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడపడుచులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలాల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఆడపిల్లల పెళ్లిళ్ల సమయంలో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ఈ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఆనే గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15వ తేదీ లోపు రైతు రుణమాఫీని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిలి శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, మిర్యాలగూడ అడవిదేవులపల్లి తహసీల్దార్‌లు హరిబాబు, సురేష్, ఆర్‌ఐలు రామకృష్ణ, సత్యనారాయణ కౌన్సిలర్లు గంధం రామకృష్ణ, నాయకులు గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి, మంద సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 11: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని డీఎస్పీ రాజశేఖర్‌రాజు హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరదు అల్లరిమూకలు గ్యాంగ్‌లుగా ఏర్పడి పట్టణంలో ఘర్షణ పడుతూ భయానక వాతావరణం సృష్టించేలా వ్యవహరిస్తున్నాయని, అలాంటి వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనస్తామన్నారు. ఇటీవల పట్టణంలో జరిగిన మూడు ఘర్షణల వెనుక కొందరు రౌడీషీటర్ల ప్రమేయం ఉన్నట్లుగా గుర్తించామన్నారు. రౌడీషీటర్ల కనుసన్నల్లో గ్యాంగ్‌వార్‌లు జరిగితే చట్టపరంగా కఠినమైన చర్యలుంటాయన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పోలీస్ యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో కొందరు ఆకతాయిలు, అల్లమూకలు రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నారని, ఇప్పటికే మూడు కేసులు నమోదు చేశామని, ఆయా కేసుల్లో నిందితులను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. గంజాయి మత్తులో గొడవలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గంజాయి వంటి మత్తు పదార్థాలను నియంత్రించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దింపామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టిసారించాలని కోరారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే, వేధింపులకు గురిచేస్తే చర్యలు ఉంటాయన్నారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న హోటళ్లు, దాబాల నిర్వాహకులు రోడ్లపై వాహనాలు ఆపకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐలు నాగార్జున, సుధాకర్, వీరబాబు, ఎస్‌ఐలు కృష్ణయ్య, శ్రీనునాయక్, రాంబాబు, విజయ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 11: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీ, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాలికల పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే పోలీస్‌శాఖకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో దేవరకొండ ఎంఈవో మాతృనాయక్‌తోపాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేవాలయాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండలం గుడితండాలో భూదేవిసమేత వెంకటేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం పూజల్లో పాల్గొన్నారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నగేష్, ఎంపీటీసీ చందునాయక్, వెంకటయ్యగౌడ్, కిన్నెర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నల్లగొండ రూరల్, జూన్ 11: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26,27వ తేదీల్లో జిల్లాకేంద్రంలో జరిగే విజ్ఞాన తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజనులకు ప్రభుత్వాలు అందించాల్సిన సంక్షేమ పథకాలు బడ్జెట్ కేటాయింపులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సరైన వసతులు, పక్కా భవనాలు లేవన్నారు. గ్రామాల్లో దళితవాడలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ప్రైవేట్ రంగం వేగంగా విస్తరిస్తోందని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దళితులు, గిరిజనుల సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు రెండు రోజులపాటు నిర్వహించే విజ్ఞాన తరగతులకు జిల్లావ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదె నరసింహ, బొల్లు రవీందర్, పుచ్చకాయల నర్సిరెడి పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 11: వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ కోరారు. మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని హోటళ్లు, కర్రీపాయింట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహారం కల్తీ అవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శానిటరీ ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ పట్టణ పరిధిలో పర్యవేక్షణ సాగిస్తారన్నారు. పౌరసేవలు అందించేందుకు కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో అధికారులు కల్యాణి, రమణ తదితరులు ఉన్నారు.

ఎడ్‌సెట్‌లో 256వ ర్యాంక్



దేవరకొండ, జూన్ 11: ఎడ్‌సెట్ ఫలితాలలో దేవరకొండ మండలం కర్నాటి పల్లి గ్రామానికి చెందిన సైదులుకు రాష్ట్రస్థాయిలో 256వ ర్యాంక్ సాధించాడు. మారుమూల గ్రామానికి చెందిన సైదులు ర్యాంక్ సాధించడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

'బకాయిల విడుదల హర్షణీయం'

వేములపల్లి, జూన్ 11: పశుగణాభివృద్ధి శాఖలో గోపాలమిత్రలుగా పనిచేస్తున్న 1530 మందికి సుమారు రూ.7.36కోట్ల నిధులను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయడం హర్షణీయమన గోపాలమిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల యాదగిరి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే ప్రభుత్వం గోపాలమిత్రలకు పీఆర్‌సీ బకాయిలు విడుదల చేసిందన్నారు. బకాయిల విడుదలకు కృషి చేసిన మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేముల వీరేశానికి కృతజ్ఞతలు తెలిపారు.

బంగారిగడ్డలో 'బడిబాట' ర్యాలీ



చండూరు రూరల్, జూన్11: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండ లంలోని బంగారిగడ్డ గ్రామంలో విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహి ంచారు. హెచ్‌ఎం చిక్కుళ్ళ రామలింగయ్య మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ఉన్నందున విద్యార్థులు వేరే ప్రాంతాలకు వెళ్లొద్దన్నారు. ప్రైవేట్ పాఠశాలలో వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ఆర్థికంగా ఇబ్బంది పడొద్దని తల్లిదండ్రులకు సూచిం చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కోటి, హెచ్‌ఎం పారిజాత దేవి, ఉపాధ్యాయులు టి. వెంకటేశ్వర్లు, పి. గౌతమి, ఎలిజబెత్, ఎండి ఖైరుద్దీన్, ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

మర్రిగూడ, జూన్ 11: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా పీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రూపొందించిన పాటల సీడీని ఉప ముఖ్యమంత్రి మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. పీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చల్లం పాండురంగారావు విద్యాభివృద్ధి, సామాజిక కార్యక్రమాలతో పాటు సాహిత్య, సాంస్కృతిక, అంబేద్కర్ పాటల ద్వారా తమ గళం వినిపిస్తున్నందుకు అభినందించారు. సీడీ ఆవిష్కరణ కార్యక్రమంలో మర్రిగూడ ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ, వివేక్ తదితరులు ఉన్నారు.

బంగారు మైసమ్మ జాతలో ఎమ్మెల్యే పూజలు

మిర్యాలగూడ రూరల్, జూన్ 11: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన లింగమంతుల సౌడమ్మ తల్లి జాతరలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తల్లిని కోరుకున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకుల హర్షం

మిర్యాలగూడ టౌన్, జూన్ 11: ఏపీ సీఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడం పట్ల టీటీడీపీ బీసీ సెల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోగుల సైదులుగౌడ్ మాట్లాడుతూ చంద్రబాబు అన్ని అడ్డంకులు తొలగించుకుని మొక్కవోని దీక్షతో నిలిచారన్నారు. జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న చంద్రబాబు పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేస్తారన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మాడ్గులపల్లి, జూన్ 11: మండలంలోని గజలాపురం గ్రామానికి చెందిన మీసాల లాలమ్మ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మంగళవారం లాలమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల శివానందరెడ్డి, పోలోజు రమేష్‌చారి, గజ్జల నాగార్జునరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి సన్మానం

శాలిగౌరారం, జూన్ 11: భువనగిరి ఎంపీగా విజయం సాధించిన చామల కిరణ్‌కుమార్ రెడ్డిని శాలిగౌరారం మండలం రామగిరి గ్రామానికి చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు చాడ సురేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగి చామల వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదానం మహాదానం



నల్లగొండ, జూన్ 11: అన్నదానం మహాదానం అని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ చింతమల గోవర్ధన్ అన్నారు. కుమారుడు అఖిల్‌కుమార్ జన్మదినాన్ని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఎస్‌హెచ్‌ఎం సభ్యులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ ఎస్‌కే మోదిన్ పాషా, జనరల్ సెక్రెటరీ, గుండె జనార్ధన్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ సాదిక్ భాష, కార్యనిర్వాహకులు కరుణాకర్, సోమన బోయిన వెంకన్న, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు సన్మానం

శాలిగౌరారం, జూన్ 11: పదో తరగతిలో 10జీపీఏ సాధించిన మండలంలోని పెర్కకొండారం జడ్పీ స్కూల్ విద్యార్థులు నూక సాయి గణేష్, ఎస్. ప్రవళికకు హైదరాబాద్‌లో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. పాఠశాలకు శ్రేష్ఠ పాఠశాల ప్రతిభ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులు, హెచ్‌ఎం సైదులును అభినందించారు.

మిర్యాలగూడ టౌన్: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన ఎరాపురి అక్షరను పలువురు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పది జీపీఏ సాధించిన విద్యార్థులకు వందేమాతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై డీఈవో బిక్షపతి, ఎంఈవో బాలాజీనాయక్, పాఠశాల ఉపాధ్యాయులు కవిత, రాజును అభినందించారని జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి తెలిపారు.